
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం, 30, ఆగస్టు, 2023



సోమశిలలో 17.615 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 17.615 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి 295 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,750
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,473
3 శాతం జీఎస్టీతో	రూ.5,637
సవర (8 గ్రా)	రూ.45,096

గరిష్ఠం/కనిష్ఠం
37.0 /28.6

వాతావరణం

మంగళవారం గాలిలో తేమ 44 శాతం ఉంది. బుధవారం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉందని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

గిడుగు రామమూర్తికి నివాళి



గిడుగు రామమూర్తికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సిబ్బంది

నెల్లూరు (పొగతోట): జిల్లా పరిషత్ కార్యాలయంలో గిడుగు వెంకట రామమూర్తి 161వ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అరుణమ్మ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి తెలుగు భాషా పితామహుడయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపత్‌కుమార్‌కు హంస పురస్కారం



సంపత్‌కుమార్‌ను సత్కరిస్తున్న మంత్రి కారుమూరి. లక్ష్మీపార్వతి తదితరులు

వెంకటాచలం: మండలంలోని సరస్వతీనగర్ వద్దనున్న ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం డైరెక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ హంస పురస్కారాన్ని అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో మంగళవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవ వేడుకల సందర్భంగా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఎంపీ భరత్, రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీపార్వతి తదితరులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

ఉపాధి పనుల పరిశీలన



చెక్‌డ్యామ్ పూడికతీత పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

పొదలకూరు: మండలంలోని చిట్టేపల్లి, ఇనుకుర్తి గ్రామాల్లో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను కేంద్రం బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా డ్వామా పీడీ వెంకటరావు కేంద్ర బృందం వెంట ఉండి పనుల వద్దకు తీసుకు వచ్చారు. గవర్నమెంట్ ఆఫ్ ఇండియా డిప్యూటీ సెక్రటరీ సంజయ్‌కుమార్, ప్రాజెక్ట్ ఆఫీసర్ రుచి సిన్హా, ప్రాజెక్ట్ ఆర్‌డీ జాగృతిరామ్ చిట్టేపల్లికు సమీపంలో చెక్‌డ్యామ్స్ పూడిక పనులు, ఇనుకుర్తి గ్రామంలో పశువుల తాగునీటి గుంత, డ్రాగన్ ఫ్రూట్స్ సాగులను పరిశీలించారు. సంబంధిత పనుల రికార్డులను పరిశీలించారు.

110 మంది కవుల చిత్రపటాల ప్రదర్శన



కవుల చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

ముత్తుకూరు: ముత్తుకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవం – గిడుగు రామమూర్తి పంతులు జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తెలుగు భాషకు విశేషమైన కృషి, సేవలు అందించిన 110 మంది కవుల చిత్రపటాలను ప్రదర్శించారు. వారి రచనలు, సాహితీ సుగంధాలను తెలియపరిచారు. హెచ్‌ఎం సీహెచ్ సుజాత, ఉపాధ్యాయినులు మాట్లాడుతూ తెలుగు భాషలోని పద్యాలు, గేయాలు, గీతాలు ఆలపించి, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం చిత్రలేఖనం, క్విజ్, వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

డిజిటల్ పురోగతి



- 65 శాతం విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్ ద్వారానే
- రెండేళ్లలోనే 30 శాతం నుంచి 65 శాతానికి చేరిక
- వినియోగదారులకు సమయం, డబ్బు ఆదా
- వంద శాతం ఆన్‌లైన్ చెల్లింపులే లక్ష్యంగా విద్యుత్ శాఖ

టెక్నాలజీ కొత్త పుంతలు తొక్కుతోంది. దీనిని విద్యుత్‌శాఖ కూడా అందిపుచ్చుకుంటోంది. గతంలో విద్యుత్‌శాఖలో బిల్లుల చెల్లింపులు, నూతన విద్యుత్ సర్వీస్ కనెక్షన్, అదనపు లోడ్ కోసం నగదును మాన్యువల్‌గా అందచేసేవారు. కానీ గత మూడేళ్లుగా విద్యుత్‌శాఖ డిజిటల్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో డిజిటల్ లావాదేవీలు గణనీయంగా పెరిగాయి. రెండు సంవత్సరాల క్రితం ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు జిల్లా సర్కిల్‌లో డిజిటల్ పేమెంట్లు 30 శాతం ఉండగా నేడు 65 శాతానికి పెరిగాయి.

నెల్లూరు (వీఆర్సీసెంటర్): నెల్లూరు జిల్లా సర్కిల్ పరిధిలో గృహ, వాణిజ్య, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మొత్తం 8,92,131 ఉన్నాయి. ఈ సర్వీసుల ద్వారా విద్యుత్ సంస్థకు విద్యుత్ బిల్లుల రూపంలో నెలకు రూ.17,416.55 లక్షలు వసూలు అవుతున్నాయి. వీటిలో రూ.11,608.29 లక్షలు విద్యుత్ సంస్థ ఏర్పాటు చేసిన విద్యుత్‌బిల్లు వసూలు కేంద్రాల్లో నగదు రూపంలో చెల్లిస్తుండగా, మిగిలిన వినియోగదారులు రూ.5,808.26 లక్షలు డిజిటల్ పద్ధతిలో చెల్లిస్తున్నారు. దీంతో 65 శాతం విద్యుత్ బిల్లులు డిజిటల్ పద్ధతిలో విద్యుత్ సంస్థకు వసూలు అవుతున్నాయి.

డిజిటల్ పద్ధతిలో ప్రయోజనాలు

- విద్యుత్ వినియోగదారులు వారి వద్ద ఉన్న ఆండ్రాయిడ్ మొబైల్ ద్వారా ఏపీఎస్పీడీసీఎల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించడంతో వినియోగదారుల సమయం ఆదా అవుతుంది.
- విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూలైన్లలో నిలబడే బాధ తప్పుతుంది.
- బిల్లులను కట్టాల్సిన నిర్దీత గడువు లోపు ఎప్పుడైనా, ఎక్కడ నుంచి అయినా చేతిలో ఫోన్ ద్వారా బిల్లులు చెల్లించే సౌకర్యం ఉంటుంది.
- ఈ సేవా కేంద్రాల్లో సర్వీస్ ట్యాక్స్ రూపంలో చెల్లించే అదనపు నగదు మిగులుతుంది.
- డిజిటల్ పద్ధతిలో నగదు క్యాష్‌బ్యాక్ పొందే అవకాశం ఉంటుంది.

ఎలాంటి యాప్‌లలో చెల్లించవచ్చు

విద్యుత్ బిల్లులను డిజిటల్ పద్ధతిలో చెల్లించాలనుకునేవారు ప్రధానంగా గూగుల్ పే డౌన్‌లోడ్ చేసుకుని అందులో సదరన్ పవర్ ఏపీని క్లిక్ చేసి బిల్లులు చెల్లించవచ్చు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే, బిల్ డెస్క్, ఏపీ ఆన్‌లైన్, గ్రామ, వార్డు సచివాలయ యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చు.

Google Play నుండి డౌన్‌లోడ్ చేసుకోండి.

Southern Power AP | G Pay | Paytm | PhonePe | BillDesk | APOnline | గ్రామ / వార్డు సచివాలయం

డిజిటల్ పేమెంట్ల ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించే యాప్స్

డివిజన్	విద్యుత్ సర్వీసులు	డిజిటల్ చెల్లింపులు (రూ.లక్షల్లో)	నగదు రూపంలో.. (రూ.లక్షల్లో)
ఆత్మకూరు	74,314	343.09	494.44
గూడూరు	1,08,686	659.25	1406.42
కావలి	2,06,402	1214.46	2233.27
నాయుడుపేట	1,32,691	809.26	1256.21
నెల్లూరు రూరల్	1,48,541	907.68	1832.26
నెల్లూరుటౌన్	2,21,497	1874.52	4385.69
మొత్తం సర్వీసులు	8,92,131	5808.26	11608.29

వందశాతం డిజిటల్ పేమెంట్లే లక్ష్యం



ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్‌లో విద్యుత్ బిల్లుల డిజిటల్ చెల్లింపులు గతంలో కంటే నేడు ఎంతో వృద్ధి సాధించాయి. వినియోగదారులకు డిజిటల్ పేమెంట్లపై అవగాహన కలిగించడంతోపాటు దాని ఆవశ్యకతపై సిబ్బంది వినియోగదారులకు వివరించడంతో చాలా మంది డిజిటల్ చెల్లింపులపై మొగ్గు చూపుతున్నారు. ప్రస్తుతం 65 శాతంగా ఉన్న డిజిటల్ పేమెంట్లను వంద శాతానికి తీసుకు రావటమే లక్ష్యంగా పెట్టుకున్నాం. – వెంకటసుబ్బయ్య, ఎస్‌ఈ, నెల్లూరు జిల్లా సర్కిల్

7,369 మందికి కొత్తగా పెన్షన్లు

నెల్లూరు(పొగతోట): జిల్లాలో కొత్తగా 7,369 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుకను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త పెన్షన్ లబ్ధిదారులకు కానుక నగదు అందజేస్తామని తెలిపారు.

వరిసాగులో సస్యరక్షణ అవసరం



సస్యరక్షణపై కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

నెల్లూరు రూరల్: వరిసాగులో తగిన సస్యరక్షణ ఎంతో అవసరమని తిరుపతి శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్ పరిధిలోని సౌత్‌మోపూరులో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిసాగు విషయంలో రైతులు తగిన సూచనలు పాటించినట్లయితే అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. చీడపీడల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వరిసాగు సస్యరక్షణ కరపత్రాలను ఆవిష్కరించారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు లావణ్య కుమారి, పరమశివ, వినీత, శ్రీలక్ష్మి, మధుసూదన్, సమీరా, రూరల్ మండల ఏఓ నాగమోహన్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఓటర్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించండి



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన సబ్‌కలెక్టర్ శోభిక

- ఏఈఆర్‌ఓలకు కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం

కందుకూరు: ప్రత్యేక సంక్షిప్త సవరణ – 2024లో భాగంగా పెండింగ్‌లో ఉన్న ఓటర్ క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్, సహాయ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలంలో సబ్‌కలెక్టర్ శోభికతో కలిసి మంగళవారం ఏఈఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్–2024లో భాగంగా ఇంటింటి సర్వేలో సేకరించిన పత్రాలపై సమీక్షించారు. ఎస్ఎస్ఆర్–2024కు సంబంధించి సవరణ ప్రక్రియలన్నీ సజావుగా జరిగేలా చూడాలన్నారు. కందుకూరు నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్‌లలో బీఎల్‌ఓలతో ప్రారంభమైన ఓటర్ల జాబితా ఇంటింటి తనిఖీ దాదాపు పూర్తయిన నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న ఫామ్–6, ఫామ్–7, ఫామ్–8లను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఏఈఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు ఈ మేరకు కచ్చితమైన చర్యలు తీసుకోవాలని, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అదే విధంగా ఇంటింటి సర్వేలో గుర్తించిన అన్‌ట్రేస్డ్ (ఆబ్సెంటీ), డెత్, రిపీట్ ఓటర్ల విషయంలో వెంటనే ఫామ్–7 నోటీసులు ఇవ్వాలన్నారు. తిరస్కరించిన ఓటర్లకు సంబంధించి కారణాలు తప్పనిసరిగా తెలియజేయాలని, ఆ కారణాలను రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి తహసీల్దార్ పోలింగ్ స్టేషన్‌ల హేతుబద్ధీకరణకు సంబంధించి క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్‌లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

దోషులకు శిక్ష పడేలా చేయాలి

- ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ

నెల్లూరు(క్రైమ్): కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్‌లో భాగంగా గుడ్‌ట్రయల్ మానిటరింగ్ ద్వారా కేసుల్లో దోషులకు శిక్ష పడేలా చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలు నుంచి మంగళవారం పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కేసుల పురోగతిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కన్విక్షన్ బేస్డ్ పోలీసింగ్ విధానం వల్ల కోర్టుల్లో విచారణ సమయం తగ్గటంతో పాటు దోషులకు శిక్షలు పడుతున్నాయన్నారు. కాలయాపనకు తావు లేకుండా వీలైనంత మేరకు కేసుల విచారణ పూర్తిచేసి నిందితులకు శిక్షలు పడేలా చూడాలన్నారు. కోర్టు తీర్పు వేగంగా వచ్చినపుడే బాధితులకు సకాలంలో న్యాయం జరుగుతుందన్నారు. నేర నిరూపణ అయి దోషులకు శిక్ష పడితే ప్రజల్లో నేరం చేయడానికి భయం వస్తుందన్నారు. మహిళా సంబంధిత కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కోర్టు కానిస్టేబుల్, కోర్టు మానిటరింగ్ సిబ్బందితో ప్రతి రోజు కేసుల్లో పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా ప్రతిభా పురస్కారాలు



క్రీడాకారులనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- క్రీడలపై వివక్ష వీడాలి
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): క్రీడల పట్ల వివక్షతను విడనాడాలని వ్యవసాయ శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్, సహకార శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన సింహపురి స్పోర్ట్స్ ఫెడరేషన్ 13వ వార్షిక క్రీడా ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే శక్తి క్రీడాకారులకు మాత్రమే ఉందన్నారు. చదువుల్లో మార్కులొస్తున్నాయా లేదా అని చూసే తల్లిదండ్రులు క్రీడల పట్ల కూడా ఆసక్తి పెంచుకోవాలన్నారు. అనేక ఆటంకాలను ఎదుర్కొని మేజర్ ధ్యాన్‌చంద్ హాకీ క్రీడలో ఎన్నో విజయాలు సాధించి ప్రపంచంలో భారత దేశానికి ఒక ప్రత్యేక స్థానాన్ని నెలకొల్పారన్నారు. జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏ క్రీడలోనైనా ప్రతిభ కనపరిచిన క్రీడాకారులకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్న సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్‌ను అభినందించారు. సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కాల ద్వారకనాథ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో క్రీడా ప్రతిభను గుర్తించి వారిని అన్ని విధాలా ప్రోత్సహించేందుకు 13 ఏళ్ల కిందట ఫౌండేషన్‌ను ప్రారంభించామన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు వేలాది మంది క్రీడాకారులకు ఆర్థికంగా, క్రీడా పరంగా, విద్యా పరంగా ప్రోత్సాహాన్ని అందచేస్తున్నామన్నారు.



రవీంద్రమ్మకు క్రీడా గురువు అవార్డును అందజేస్తున్న మంత్రి కాకాణి



వెంకటేశ్వర్లుకు క్రీడా రత్న అవార్డును అందజేస్తున్న మంత్రి కాకాణి

బహుమతి ప్రదానోత్సవం

సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్‌లో భాగంగా ఈ ఏడాది క్రీడా గురువు పురస్కారాన్ని విక్రమ సింహపురి యూనివర్సిటీ స్పోర్ట్స్ సభ్యురాలు, క్రీడాకారిణి రవీంద్రమ్మకు, క్రీడా రత్న పురస్కారాన్ని సీనియర్ ఫిజికల్ డైరెక్టర్, అథ్లెట్ వెంకటేశ్వర్లుతో పాటు ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన నలుగురికి, జాతీయ పురస్కారాలు సాధించిన 32 మందికి, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్న 105 మందికి, యూనివర్సిటీ స్థాయిలో 46 మందికి, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన 216 మందికి, 49 మంది మాస్టర్స్‌కు, వారికి శిక్షణ ఇచ్చిన 79 మంది గురువులకు మొత్తం 763 మందికి ఈ ఏడాది ఎస్ఎస్ఎఫ్ అవార్డుల ద్వారా రూ.3లక్షల నగదు ప్రోత్సాహాలను, జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అతిథులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సెట్నల్, డీఎస్ఏ సీఈఓ నాగరాజకుమారి, డీఎస్ఏ చీఫ్ కోచ్ ఆర్కే.యతిరాజ్, ఫౌండర్ చైర్మన్ ముక్కాల ద్వారకనాథ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనం మహేష్‌రెడ్డి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి నిమ్మల వీరవెంకటేశ్వర్లు, బ్యాడ్మింటన్ సంఘం కోశాధికారి శ్రీకాంత్, సభ్యులు ప్రసాద్, పీఈటీలు చంద్రశేఖర్, సుబ్బయ్య, అజయ్ కుమార్, పలువురు కోచ్‌లు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేద్దాం



రాయపేటలో మాట్లాడుతున్న డీజీపీ (ఫైర్ సర్వీస్) పీవీ సునీల్‌కుమార్

అల్లూరు: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీజీపీ (ఫైర్ సర్వీస్) పీవీ సునీల్‌కుమార్ అన్నారు. అల్లూరు మండలం రాయపేట గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహ మొదటి వార్షికోత్సవంలో పాల్గొనేందుకు మంగళవారం ఆయన గ్రామానికి వచ్చారు. మొదటగా స్థానిక అల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు ఎల్లు సాల్మన్‌రాజు, పుప్పు సుధాకర్, చెంతాటి ప్రసాద్, రాజేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పులు అధికంగా జరగాలి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు బాగా పెరగాలని, అదే విధంగా ఆరోగ్యశ్రీ సేవలు మరింత మెరుగుపడాలని జిల్లా వైద్యాధికారి పెంచలయ్య ఆదేశించారు. నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ఆరోగ్యశ్రీ పై వైద్య అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లోకి కాన్పుల కోసం వచ్చే వారికి ఎక్కడా ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగే విధంగా చూడాలన్నారు. ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త చంద్రశేఖర్ మాట్లాడుతూ కాన్పులకు వచ్చే వారికి నాణ్యమైన వైద్యాన్ని అందించి తల్లీబిడ్డలను సంతోషంగా పంపాలన్నారు. ప్రధానంగా ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు.

ఆస్పత్రుల్లో వసతుల కల్పనపై దృష్టి



వైద్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): 'ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో మౌలిక వసతుల కల్పనపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలి.' అని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని మేకపాటి క్యాంప్ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్‌ఎస్ రమేష్‌నాథ్, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీల వైద్యులతో మంగళవారం ఎమ్మెల్యే ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాస్పత్రుల్లో అవసరమైన సదుపాయాలు, ఖాళీగా ఉన్న పోస్టులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా మంజూరు కావాల్సిన అభివృద్ధి పనుల గురించి జాబితాను సిద్ధం చేసి అందించాలని కోరారు. నిధుల మంజూరుకు కృషి చేస్తామని, మిగిలిన పనులు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో చేస్తామని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయిస్తున్నారన్నారు. వాటిపై వైద్యాధికారుల పర్యవేక్షణ ఉండాలని, అదే విధంగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నియోజకవర్గంలో ముమ్మరంగా చేపట్టాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ వైద్యం పక్కాగా అందేలా కృషి చేయాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న సమయంలో దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం అడుగుతున్నారని, ఈ విషయంపై ప్రధానంగా దృష్టి సారించాలన్నారు.

బాబు, పవన్‌లకు గుణపాఠం చెప్పడం ఖాయం

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు నాయుడు, ఆయన దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్‌లకు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 20వ వార్డులో ఉన్న రామచంద్రాపురంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రజలకు ఏమైతే మాకేంటని, తమ ప్రాణాలకు ఏమీ కాకూడదని బాబు, పవన్‌లు పక్క రాష్ట్రంలో దాక్కున్నారని విమర్శించారు. మీ ఇద్దరూ ఇప్పుడొచ్చి ప్రజలను బాగు చేస్తామంటే ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. పక్క రాష్ట్రానికి చెందిన మీకు ఎన్నికలు సమీపిస్తున్నాయనగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. కరోనా సమయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది మాత్రమే ప్రజల బాగోగులు చూశారని గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికలు వస్తున్నాయని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చెరో వ్యాన్ ఎక్కి ముఖ్యమంత్రిని లక్ష్యంగా చేసుకుని ఇష్టానుసారంగా తిడుతున్నారన్నారు. అన్నింటిని గమనిస్తున్న ప్రజలు మరోసారి వారిద్దరికి గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైస్ చైర్‌పర్సన్ కోటంరెడ్డి లలితారెడ్డి, కౌన్సిలర్ చలంచర్ల శ్రీదేవి, నాయకులు పుట్టా సుబ్రహ్మణ్యం నాయుడు, జయచంద్ర, పెంచలయ్య, మోర్ల మురళి పాల్గొన్నారు.



బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, చిత్రంలో ప్రజాప్రతినిధులు తదితరులు

చంద్రబాబు ప్రజలకు మంచి చేయలేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పక్కన వైఎస్సార్‌సీపీ నాయకులు

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 14 సంవత్సరాలు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రజల కోసం ఒక్క మంచి పని కూడా చేయలేదని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. కావలిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సినిమాల్లో రాముడు, కృష్ణుడు పాత్రలు వేసి తెలుగు ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవిని లాక్కున్న చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి కోసం ఏమీ చేయలేదన్నారు. ఎన్టీఆర్ కన్నుమూసే నాటికి చంద్రబాబు తెలుగుదేశం వేరన్నారు. బాబు ఎన్టీ రామారావుకు చేసిన ద్రోహాన్ని ప్రజలు మర్చిపోలేదని ఎమ్మెల్యే తెలిపారు. వెన్నుపోటుతో సీఎం అయిన బాబు, అదే ఒరవడిని పాలనలో కొనసాగించారన్నారు. ఆయన తన జీవితంలో ఎవరికీ విశ్వసనీయమైన స్నేహితుడు కాలేదన్న నిజం ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అందరికీ తెలుసన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రజలను మోసం చేసేందుకు విచిత్రమైన పేర్లతో తిరుగుతున్నారని చెప్పారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత పాలనలో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఎంతో పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని కొనియాడారు. ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, పందిటి కామరాజు, గంధం ప్రసన్నాంజనేయులు, ఈతముక్కల చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, పోతనబోయిన వేణుగోపాలరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల అభ్యున్నతికి కృషి

• పోర్టు సీఈఓ జీజే రావు



వంట సామగ్రి అందజేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టు మహిళల అభ్యున్నతికి కృషి చేస్తోందని పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. ఎంప్లాయీ వలంటీర్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం పోర్టు ప్రభావిత గ్రామాలకు చెందిన 101 మంది నిరుపేద మహిళలకు ఉచితంగా వంట సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు ఉద్యోగులు తమ సొంత నిధులతో పేద మహిళలకు సాయం చేయడం సంతోషంగా ఉందన్నారు. అదానీ ఫౌండేషన్ సాయంతో ఇటీవల ఇంటర్ పూర్తి చేసి మెడికల్ సీటు సాధించిన ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన కె.వినీతను సీఈఓ అభినందించారు. కార్యక్రమంలో సీఓఓ సంజయ్, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, సీఎస్సార్ అఫైర్స్ హెడ్ గంటా వేణుగోపాల్, రాజేష్ రంజన్, సత్యనారాయణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంటికొస్తూ.. రైల్లో నుంచి పడి..



యాదగిరి (ఫైల్)

కావలి: ఉపాధి నిమిత్తం వెళ్లిన ఓ వ్యక్తి రెండు నెలల తర్వాత ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో రైల్లో నుంచి పడి మృతిచెందాడు. కుటుంబసభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు.. కావలి రూరల్ మండలం చెన్నాయపాళెం పెద్ద పట్టపుపాళెం పంచాయతీలోని చిన్న పట్టపుపాళెం గ్రామానికి చెందిన వాయిల యాదగిరి (42)కి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. అతను 15 ఏళ్లుగా కర్ణాటక రాష్ట్రంలోని మంగళూరులో బోట్లలో చేపలు పట్టే పని చేసేవాడు. రెండు నెలల క్రితం సొంతూరికి వచ్చి తిరిగి పనికి వెళ్లాడు. ఇంటికి వస్తున్నానంటూ సోమవారం కుటుంబ సభ్యులకు సంతోషంగా సమాచారం ఇచ్చాడు. మంగళూరులో యాదగిరి రైలు ఎక్కి నాలుగు గంటలపాటు ప్రయాణించిన తర్వాత కేరళ రాష్ట్రంలోని మలప్పురం జిల్లా తిరూర్ అనే పట్టణం వద్దకు రాగానే రైల్లో నుంచి జారిపడి మరణించాడు. మృతదేహం మంగళవారం గ్రామానికి చేరుకోవడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

పథకాలు వివరిస్తూ.. భరోసా కల్పిస్తూ..



దప్పళంపాడులో సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

గుడ్లూరు: మండలంలోని పరకొండపాడు సచివాలయ పరిధిలో వడ్లమూడివారిపాళెం, దప్పళంపాడు గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తామని ఆయన భరోసా కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయాల వ్యవస్థల ద్వారా అవినీతిరహితంగా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేస్తున్నట్లు చెప్పారు. ఓవైపు సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరిస్తూ ఇంకా వారికి సమస్యలుంటే తెలుసుకుని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సూర్యనారాయణ సింగ్, ఎంపీడీఓ చంద్రసేన్, ఎంపీపీ పులి రమేష్, జెడ్పీటీసీ కోర్సిపాటి బాపిరెడ్డి, దప్పళంపాడు, పరకొండపాడు సర్పంచ్‌లు హరిబాబు, కొండయ్య, వైఎస్సార్‌సీపీజిల్లా కార్యవర్గ సభ్యులు బిల్లా రమణయ్య, మాజీ ఏఎంసీ చైర్మన్ సూర్యనారాయణ, జేసీఎస్ కన్వీనర్ కిశోర్, ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పాలనకు జనం జేజేలు

• ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి



బుక్‌లెట్ అందజేస్తున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

సీతారామపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజలు జేజేలు పలుకుతున్నారని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని అయ్యవారిపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీల ద్వారా అర్హులను పథకాలకు దూరం చేసినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వంలో వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా ఇళ్ల వద్దకే పథకాలు అందుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేక టీడీపీ, జనసేనలు కుట్రలు చేస్తున్నాయన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి, ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, జెడ్పీటీసీ చెరుకుపల్లి రమణారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి తిరుపతయ్య, మండల ఉపాధ్యక్షుడు బసిరెడ్డి కృష్ణారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ బాలినేని మాబయ్య, సర్పంచ్ చింతనబోయిన దుర్గాప్రసాద్, నాయకులు ఖాసింపీరా, రమణారెడ్డి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా విజయవంతం



ఉద్యోగాలకు ఎంపికైన వారితో అధికారులు

నెల్లూరు(మినీబైపాస్): నెల్లూరులోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి అధికారి కేవీ రామాంజనేయులు మాట్లాడుతూ మొండెలెజ్ ఫుడ్ లిమిటెడ్ (క్యాడ్బరీ కంపెనీ) కంపెనీ, ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించాయన్నారు. క్యాడ్బరీ కంపెనీకి 52 మంది ఇంటర్వ్యూకు హాజరుకాగా 9 మందికి ఉద్యోగావకాశం లభించినట్లు తెలిపారు. వీరికి జీతంగా సంవత్సరానికి రూ.2.2 లక్షలు ఇస్తారన్నారు. ఫ్లిప్‌కార్ట్‌కు 14 మంది హాజరుకాగా నలుగురికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. వీరికి జీతంగా నెలకు రూ.15,000 నుంచి రూ.30,000 ఇస్తారన్నారు. ఎంపికైన వారికి జిల్లా ఉపాధి అధికారి నియామకపత్రాలను అందజేశారు.

వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం



పోస్టుమార్టం చేయించేందుకు వచ్చిన పోలీస్, అధికారులు

ఆత్మకూరు: పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లికి చెందిన ఓ వివాహిత గత నెలలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అప్పట్లో ఇరు కుటుంబాల మధ్య రాజీ కుదరడంతో కేసు లేకుండానే ఖననం చేశారు. అయితే ఇటీవల వారి మధ్య వివాదం చెలరేగడం.. పోలీసులకు ఫిర్యాదు చేయడం.. హైకోర్టులో పిటిషన్ వేయడం తదితర పరిణామాలతో మృతదేహానికి 50 రోజుల అనంతరం పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్సై ముత్యాలరావు కథనం మేరకు.. పట్టణంలోని ఎల్‌ఆర్‌పల్లికి చెందిన షేక్ రవూఫ్, సయ్యద్ ఆసీఫా (27) దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. కాగా ఆసీఫాతో తోడికోడలు నస్రీన్, మరిది మునాఫ్ గొడవలు పడుతుండేవారు. మాటలతో ఆమెను మానసికంగా హింసించేవారు. ఈ క్రమంలో జూలై 10వ తేదీన ఆసీఫా ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. దీంతో కుటుంబసభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. పెద్ద మనుషులు మాట్లాడి కేసు పెట్టకుండా తల్లిని కోల్పోయిన చిన్నారులకు నస్రీన్, మునాఫ్ నష్టపరిహారం చెల్లించేలా ఒప్పందం చేశారు. అయితే వారిద్దరూ పిల్లలకు ఏమీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో నస్రీన్, మునాఫ్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించాలని కోర్టు ఆదేశించింది. దీంతో పోలీసులు సుల్తాన్ షాహిద్ దర్గాలోని ఖబరస్తాన్ వద్ద ఆత్మకూరు తహసీల్దార్ లక్ష్మీనరసింహ, ప్రభుత్వ డాక్టర్ల సమక్షంలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఎస్సై తెలిపారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.55
సన్నవి	: రూ.35
పండు	: రూ.9

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 140
లేయర్ (లైవ్)	: 105
బ్రాయిలర్ చికెన్	: 240
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 266
లేయర్ చికెన్	: 178